విశాలహృదయుడు

ముద్దంశెట్టి హనుమంతరావు

కాలువదగ్గరికొచ్చిన రాఘవకి, కరచరా లాడలేదు. కాలువ పొంగి ప్రవహిస్తూ వుండటమే అందుక్కారణం.

వర్షం సన్నగా కురుస్తోంది. గొడుగు వేసుకున్నాడేగాని, వొళ్ళంతా తడిచి నట్టుగా వణికిపోతున్నాడు, రాఘవ. చల్లని గాలి జివ్వుమనిపిస్తోంది. ఆకాశం వేపు చూశాడు చుట్టూ మేఘాలు కమ్మి వున్నయ్. వాచీ చూసుకున్నాడు. ఆరు కావస్తోంది. కాలువని దాటి వెళ్ళడం యెలా? తనకి ఈత రాదే? చిన్నప్పుడు యీత నేర్చుకోకపోవడం, పొరపాటే అయ్యిందని యిప్పుడనిపిస్తోం దతనికి.

అక్కడి వాతావరణం, తన నిస్సహాయత చూస్తుంటే, రాఘవకి మతిపోయి నట్టయ్యింది. మళ్ళ వెనక్కి వెళ్ళి, జంక్షను నించి తమ వూరు నడిచి వెళ్ళాలంటే, చాలా సమయం పడుతుంది. అంతేకాదు – తన రాకకోసం, తల్లిదండ్రులు ఎంతో ఆరాటంతో, ఆతృతతో యెదురుతెన్నులు చూస్తుంటారు. వాళ్ళ ఆరాటానికి, తాను కారకుడు కాకూడదు. కాని....కాని.. యెలా వెళ్ళడం? అదే ఆలోచన అతణ్ణి కలవరపెట్టసాగింది.

ఎవరైనా అగుపిస్తారేమోనని, చుట్టూ ఓసారి కలయజూశాడు, రాఘవ. రోడ్డు మీద యెవరో ఓ వ్యక్తి యిటుకేసే వస్తూవుండటం చూశాక, రాఘవలో ఆశ

తళుక్కుమంది. ధైర్యం పుంజుకుంది. ఆ వస్తోన్న వ్యక్తి తప్పకుండా తనకి సహాయం చెయ్యగలడన్న నమ్మకం యేర్పర్చుకున్నాడు మనసులో. దృష్టిని మాత్రం అటుకేసే కేంద్రీకరించాడు.

ఆ వ్యక్తి తీరా దగ్గరికి వచ్చేసరికి, అతణ్ణి చూసి, నిర్ఘాంతపోయాడు, రాఘవ. ఆ వ్యక్తి, అతని విరోధి ఆనందరావు కావడమే అందుకు హేతువు. తమ రెండు కుటుంబాల మధ్య, పచ్చగడ్డి వేస్తే భగ్గుమనిపించే వైరాగ్యం రగుల్తోంది, చాలారోజుల్నించి. అటువంటి వ్యక్తి సహాయాన్ని తానెలా అర్థిస్తాడు? క్షణం క్రితం రాఘవలో మెరిసిన ఆశాజ్యోతి ఆరిపోయింది. మళ్ళీ ఆలోచనల్లో పడ్డాడు తనిప్పుడేం చెయ్యడం, వెనక్కి తిరిగి వెళ్ళిపోవడమా? ఒక వేళ తాను పౌరుషాన్ని వదిలిపెట్టి అర్థించినా, అతను సహాయంచేస్తానని నమ్మించి, కాలువమధ్యలో తనకి అపకారం తలపెడితే? తనభయాన్ని భావనాలోకంలో వూహించుకుని, జలదరించిపోయాడు అది నిజమే. మనిషి పగ, పాముపగకంటె ప్రమాదమైనదంటారు. ఆ పగ ధ్యాసలో మానవత్వం కూడా గుర్తుకురాదు. అయినా, తనెందుకు అనవసరంగా చిక్కులు కొనితెచ్చుకోవడం?

ఇలా పరిపరివిధాల ఆలోచిస్తూ వుండిపోయాడు, రాఘవ.

వర్షపుజల్లు వుధృతమౌతోంది. కాలువ ప్రవాహపు హోరు వింత సంగీతంలా వినిపిస్తోంది.

అదే సమయంలో ఆనందరావు ఆలోచనల్లో పడ్డాడు. రాఘవకి ఈత రాదని అతనికి బాగా తెలుసు. అందుకేనేమో రాఘవ యేంచెయ్యాలో తెలీని అయోమయస్థితిలో పడ్డాడని వూహించగలిగాడు, తమ కుటుంబాల మధ్యగల బద్ధవైరం గుర్తుంచుకుని, తన సహకారాన్ని అర్థించడానికి రాఘవ వెనకంజ వేస్తున్నాడేమోనన్న అనుమానం కలిగింది, ఆనందరావుకి.

సహజంగా, ఆనందరావు సౌమ్యుడు. కక్షలూ, కార్పణ్యాలూ, కలకాలం వుండకూడదనే సదుద్దేశం గలవాడు. అందుకే తను సుళువుగా యీదుకుని కాలవనాటి వెళ్ళిపోగలిగినా, రాఘవ నిస్సహాయతను చూసి ఆలోచించాడు. ఇంతవరకూ ఎటువంటి అవకాశమూ రాలేదుగానిట్టి, చొరవ చేసి రాఘవతో మాట్లాడలేకపోయాడు, ఆనందరావు. అనుకోకుండా, యిప్పుడీ అవకాశం వచ్చింది. రాఘవ మనస్తత్వం యెలావున్నా, యిప్పటి పరిస్థితి స్పష్టాకీ, తనే చొరవ తీసుకోవాలన్న నిర్ణయాన్ని తీసుకున్నాడతను. నిజం చెప్పాలంటే, ఆనందరావుకి యెవరితోనన్నా విరోధం తెచ్చుకోవాలన్నా, విరోధిగా వుండాలన్నా, మనసు పీకుతుంది. అందుకనే, ఓ మెట్టు కిందికి దిగాడు తనే.

"రాఘవగారూ..." మెల్లగా అన్నాడు ఆనందరావు.

ఆ నిర్జన ప్రదేశంలో, స్పష్టంగా వినిపించిందా పిలుపు, రాఘవకి. విస్తుపోయాడు. ఆనందరావే ప్రప్రథమంగా పలకరించినందుకు, అతనిలోని అతిశయ నైజం అవంతించింది. ఆనందరావుకేసి చూశాడు. మళ్ళీ ఆనందరావే అందుకున్నాడు. "అలా ఆలోచిస్తున్నారేమిటి? కాలవ యెలా దాటడమనే కదా? అలా ఆలోచిస్తూ యెన్నాళ్ళు కూచున్నా, ప్రయోజనం యేముంటుంది చెప్పండి? మీకు యీత రాదని నాకూ తెలుసు. అంచేత, మీకు అభ్యంతరం లేకపోతే, నేను మిమ్మల్ని అవలి ఒడ్డుకి తీసుకుపోతాను. వాతావరణం చూస్తుంటే, వర్షం క్రమంగా అధికమయ్యేట్టుంది. మన కుటుంబాల మధ్యగల వైరాన్ని, యీ క్షణంలో ఓ పక్కకి నెట్టండి. అదీగాక స్థూలంగా యోచిస్తే, విరోధం పెంచుకున్నది మన పెద్దలేగాని, మనం కాదు కదా! ఇల్లాంటప్పుడు మన మధ్య విభేధాలకి చోటుండకూడదు. ఆలోచించండి." అంటూ తన అంతరంగంలోని భావాన్ని వ్యక్తం చేశాడు, ఆనందరావు.

ఆనందరావు సహృదయానికి యిదో నిదర్శనం. సహృదయమే లేని వ్యక్తి అయితే, తన విరోధికి తానెందుకు సహాయం చెయ్యాలన్న పట్టుదలతో, యీసడింపుగా నవ్వుతూ, సగర్వంగా, తనకేమీ పట్టనట్టే తన మానాన తాను యీదుకుంటూ కాల్వదాటేసేవాడే! కాని అలా చెయ్యలేదు. చిరకాలంగా, తమ కుటుంబాల మధ్య వున్న బద్ధవైరాన్ని సహితం పక్కకినెట్టి, తన మానవతను, మంచి మనస్సును ప్రకటించుకున్నాడు, ఆనందరావు.

అయితే, రాఘవ ఆనందరావు సహృదయతని యధాతధంగా అర్థంచేసుకోలేకపోయాడు. 'కోరి పిలిస్తే కులంతక్కువ' అన్న సామెతలా ఆనందరావు ప్రకటించిన మంచితనం మాటున, వంచన పొంచివుందేమోనన్న అనుమానం అతని మనసులో మొలకెత్తింది తనకి అపకారం చెయ్యాలన్న అభిప్రాయంతోనే, తనకి సహకరిస్తానంటున్నాడని భావించాడు. మనిషిలో వుండే సహజ ప్రవృత్తికి, రాఘవ కూడా లోనయ్యాడంటే, అదేం ఆశ్చర్యం కాదు.

"ఎందుకులెండి ఆనందరావుగారూ మీకా శ్రమ? నేను జంక్షనుకి తిరిగివెళ్ళి, అక్కణ్ణించి మనవూరు పోతాన్లెండి." అనేశాడు, రాఘవ.

"ఇందులో శ్రమేముందండీ? నేను గజీతగాణ్ణి .... ఆ సంగతి మీకూ తెలుసు. ఇద్దర్ని ఒకేసారి నా వీపుమీద కూచోబెట్టి తీసుకుపోగల్ను. నాకు నేనుగా యిలా కోరి చెబుతున్నానని, నన్ను అపార్థం చేసుకోకండి. ఏ విధమైన అనుమానాన్ని మనసులో పెట్టుకోకండి. మన కుటుంబాల మధ్య బద్ధవైరం వుండి వుండొచ్చు. ఈ పరిస్థితుల్లో విస్మరించాలి.

ఇక్కడ మనిద్దరం ఒకటి మానవులం. ఒకరొకరు సహకరించుకోవడం, మానవధర్మం. నన్ను నమ్మండి. భగవత్సాక్షిగా చెబుతున్నాను. యీ పరిస్థితుల్లో 'యీత' రాని మిమ్మల్ని ఆదుకోవాలనిపించింది. చొరవచేసి చెప్పాను. అప్పటికీ మీరు నన్ను నమ్మకపోతే, అది నా దురదృష్టం." రాఘవని నమ్మించాలని ప్రయత్నించాడు, ఆనందరావు.

రాఘవ నిర్ఘాంతపోయాడు. తన మనసులోని అనుమానాన్ని ఆనందరావు ఎలా గ్రహించగలిగాడో అతని వూహకి అందలేదు.

రాఘవ, మళ్ళీ ఆలోచనల్లో పడ్డాడు. ఆనందరావు గురించి ఒక నిజం మాత్రం అతనికి తెలుసు. అదేమిటంటే, అతను సహృదయుడని.... సహకారభావం అతని నరనరాల్లో ప్రవహిస్తోందని; అంచేత, తనలో రేకెత్తిన శంకను, ఓ పక్కకు నెట్టి, ఆనందరావుని నమ్మాలన్న నిర్ణయానికొచ్చాడు.

"సరే, ఆనందరావుగారూ; పదండి మీరన్నట్టు, వైరం మన పెద్దలమధ్యే గాని, మనమధ్యలేదుకదా! మనం స్నేహితులమే!" వుత్సుకతతో అన్నాడు రాఘవ,

ఆనందరావు, చిన్నగా నవ్వుకున్నాడు.

బట్టలు, గొడుగులు, ఓ చేత్తో పట్టుకుని రాఘవ, ఆనందరావు వీపుకి అంటుకున్నట్టుగా పెనవేసుకున్నాడు, ఆనందరావు సలహామేరకు. కాలవలో దిగాడు ఆనందరావు. రెండు నిమిషాల్లో అవలి

ఒడ్డుకి చేరుకున్నారిద్దరూను. అంతవరకూ యెంత ధైర్యంగా వుండాలనుకున్నా, రాఘవ గుండెలు జోరుగా కొట్టుకుంటూనే వున్నాయి. ఏదో అనుమానం లీలగా పీక్కుతింటూనే వుంది. అవలి ఒడ్డుకి చేరాక స్థిమితపడ్డాడు.

"థాంక్స్ ఆనందరావుగారూ!" అన్నాడు కృతజ్ఞతాపూర్వకంగా రాఘవ, దుస్తులు వేసుకుంటూను

"దానికేముందిలెండి. బహుశా మీరు, యివతలి ఒడ్డు చేరేవరకూ అపనమ్మకంతోనే వున్నారనుకుంటాను!" చిన్నగా మందహాసం చేస్తూ అడిగాడు, ఆనందరావు.

నిజానికి అది వాస్తవమే అయినా, అవుననలేకపోయాడు, రాఘవ.

"అబ్బే! అదేం కాదనుకోండి. మీ మాటలమీద, నాకు గట్టి నమ్మకం యేర్పడింది. మీ మంచితనమేమిటో నాకు బాగా తెలుసు స్వతహాగా మీరు క్రూరులు కారు. ఇవన్నీ ఆలోచించే, మీ వెంట వచ్చాను. ఏది యేమైనా, యీ విధంగా నయినా, యెన్నేళ్ళనుంచో మన కుటుంబాలమధ్య పేరుకుపోయిన ప్రబల వైరం, కరిగిపోయింది మనిద్దరం మిత్రుల

మయ్యాం. అందుకు, నేనెంతో ఆనందిస్తున్నాను." తృప్తిగా అన్నాడు రాఘవ.

"అది. మనం యిప్పుడే చెప్పలేమండీ రాఘవగారూ! మీ నాన్నగారూ సులువుగా పరిస్థితులతో రాజీ పడతారనుకోను." తన అనుమానాన్ని వ్యక్తీకరించాడు, ఆనందరావు.

"అవ్వే! అలా జరగదులెండి. వాళ్ళ మనస్తత్వాల్ని, మూర్ఖత్వాన్ని, మార్చే ప్రయత్నం యీ తరంవాళ్ళం మనం చెయ్యాలి. ఆ బాధ్యతని, నేను తీసుకుంటున్నాను. మా నాన్నగార్ని నేను కన్విన్స్ చేస్తాను." గట్టి విశ్వాసంతో అన్నాడు రాఘవ.

"అలా అయితే, మరింకేం! అన్ని విధాల శ్రేయస్కరమే! నిజానికి మన పల్లెల్లో పురోగతి రాకపోవడానికి కొంత మేరకు కారణం, యిటువంటి కక్షలూ, కార్పణ్యాలే అంటాను. నాకు మట్టుగ అందరితో కలిసికట్టుగా, స్నేహభావంతో బ్రతకాలని వుంటుంది సుమండీ! ఇంతా చూస్తే, యెవరు పట్టుకుపోయేదీ యేమీ లేదు. ఈ భూమ్మీదకి యెలా వచ్చామో, యిక్కణ్ణించి వెళ్ళాల్సింది ఆ తీరులోనే. మనిషి తదనంతరం మిగిలిపోయేవి, మంచీ, చెడులే!" వేదాంత ధోరణిలో చెప్పుకుపోయాడు, ఆనందరావు.

"మీరన్నది, అక్షరాలా నిజమండీ ఆనందరావుగారూ! స్నేహభావం, సహకారభావం, అందరిలోనూ వుండాలి. ఈనాటి సంఘటన, మీ విశాలహృదయాన్ని చెప్పక చెప్తోంది. నేను విరోధినని తెలిసి కూడా, మనసులోని వైరాన్ని తుడిచేసి, చొరవతీసుకుని, సహృదయంతో సహాయం చేసేందుకు ముందుకు రావడం, మీ ఔదార్యాన్ని, మీ ఔన్నత్యాన్నీ చాటుతోంది."

సన్నగా నవ్వేడు, ఆనందరావు.

వర్షపు జల్లు తగ్గుముఖం పడుతోంది. మరి కాస్సేపటికి వూళ్ళోకి అడుగు పెట్టారు వాళ్ళిద్దరూను.

రాఘవ, ఆనందరావు, కలిసి నవ్వుతూ, మాట్లాడుకుంటూ వెళ్తుంటే, వాళ్ళని చూసినవాళ్ళంతా ఆశ్చర్యపోయారు. ఏదో వింతను చూస్తున్నట్టుగా, ముక్కుమీద వేలేసుకున్నవాళ్ళూ లేకపోలేదు.

"మా ఇంటికి రండి, కాఫీ తీసుకుని వెళ్దురుగాని...." ఆహ్వానించాడు, రాఘవ. వాళ్ళడాబా యిల్లు ముందుకే వుంది.

"ఇప్పుడు కాదండీ రాఘవగారూ! బట్టలు తడిచి వున్నాయి కదా! రేపు వస్తాన్లెండి."

"సరేలెండి. రేపు ఉదయం తప్పక రావాలి. మీ కోసం యెదురు చూస్తుంటాను."

"అలాగే!"

"వస్తానండీ! మరోసారి నా ధన్యవాదాలు చెప్పుకుంటున్నాను...." అంటూ యింట్లోకి నడిచాడు, రాఘవ.

ఆనందరావు, ముసిముసి నవ్వుకుంటూ, ముందుకి సాగిపోయాడు. అతని హృదయం వుప్పొంగిపోయింది. ఆనాటి సంఘటనకి.

ఆ రోజునించీ, ఆ రెండు కుటుంబాలూ, వైరాన్ని విస్మరించి, సన్నిహితమయ్యాయి.